# అపేక్ష

కొలను వేంకట దుర్గాప్రసాద్

**సు**బ్బరామయ్య ఆరుబయట **మంచం** మీద పడుకున్నాడన్నమాటే గానీ, నిద్ర పోలేక పోతున్నాడు.

ఆకాశంలో అక్కడక్కడా చుక్కలు మెరుస్తున్నాయి.

పడుకున్న మనిషి లేచి కూర్చున్నాడు. బయట గేటువంక చూసాడు, ఏదన్నా సైకిలు ఆగిన చప్పుడు వినపడుతుందేమోనని. ఊహూ, చప్పుడు కాలేదు.

మంచం మీదనుండి మెల్లగాలేచి వరండాలోకి వెళ్లాడు. కూజాలోంచి చల్లటి నీళ్ల గ్లాసులోకి వొంపుకొని త్రాగాడు. మళ్లీవచ్చి మంచంమీద కూర్చున్నాడు.

'ఏవేఁ' పిల్చాడు భార్యని. ఆమె పలకలేదు.

'జానకీ' పిల్చాడు మళ్లా. ఆమెకదలలేదు.

తన మంచం మీద నుండి లేచి భార్య మంచం దగ్గరికెళ్లి మెల్లగా తట్టి 'జానకీ!' అని పిల్చాడు.

ఈ సారి ఆమె కదిలింది. ఆయన్ని చూసి ఆవలిస్తూ లేచింది. 'బాబ్జి వచ్చాడా ?'అంది మగతగానే.

'లేదు !' నిట్టూర్పుతో అన్నాడు.

'అప్పుడ్నుంచీ మెలుకువగానే వున్నారా ?' అడిగింది.

'నిద్ర పట్టలేదు' అన్నాడు.

'టైము ఎంత అయిందో' అంది, మంచం మీదనుండి లేస్తూ.

'ఇంతకుముందు చూసినపుడు పదకొండున్నరయింది ఇప్పుడు పన్నెండు కావచ్చు' అన్నాడు.

జానకి పలకలేదు.

'నేనలా ఓమారు రోడ్డు మీద కెళ్లొస్తాను' అన్నాడు బయలు దేరుతూ.

'ఎందుకు ఈ చీకట్లో? వాడే వొస్తాడ్లెండి!'... 'ఏ సినిమాకో వెళ్లుంటాడు' అం.

'చెప్తే చెప్పి వెళ్లేవాడుకదా ! ...సినిమాకి వెళ్లి వుండడు.' సుబ్బరామయ్య గేటు తెరిచాడు. జానకి వెంట వచ్చింది గేటువరకు.

సుబ్బరామయ్య చీకట్లోకి నడిచాడు.

అదొక లైట్లులేని చిన్నవీధి. ఆ వీధిని ఓ ఫర్లాంగు నడిస్తే మెయిన్‌రోడ్డు వస్తుంది.

సుబ్బరామయ్యకు చీకట్లో దారి కనిపించలేదు కాసేపు చీకట్లో నిలబడ్డాడు. కొంచెం దారి కనిపించినట్లు అనిపించింది.

ముందుకు నడిచాడు దగ్గు వచ్చింది. గట్టిగా దగ్గాడు ఓ నిముషం, నడుస్తూనే

చీకట్లో కుక్క 'భౌ య్'మని ఒక్కసారిగా అరిచింది. సుబ్బరామయ్య చలించలేదు. ఆ కుక్క వీరాస్వామి నాయుడుదని తెలుసు. 'ఛయ్' అని కసురుకున్నాడు. కుక్క అరుపు మానింది.

సుబ్బరామయ్య నడుస్తున్నవాడల్లా ఆగిపోయాడు. మెయిన్‌రోడ్డు మీదనుండి ఓ సైకిల్‌లైటు వీధిలోకి చీకటిని చీల్చుకుంటూ వస్తూ కనిపించింది. లైటు రాను రాను దగ్గరయింది.

'అమ్మయ్య... వస్తున్నట్టున్నాడు.' అనుకున్నాడు.


సైకిలు దగ్గరికివచ్చి ఆగింది.

'బాబ్జి !' మెల్లగా పిల్చాడు.

'నేను, రంగనండీ !... బాబ్జి ఇంకా రాలేదా ?' అడిగాడు రంగారావు.

'ఇంకా రాలేదు. వాడికోసమే చూస్తున్నాను'

'ఎక్కడికెళ్లాడు ?'



'చెప్పివెళ్లలేదు. ఎక్కడికెళ్లాడో తెలీడం లేదు...' సుబ్బరామయ్య అన్నాడు, ఆందోళన వీలయినంతవరకు వ్యక్తంకానీయకుండా.

'సినిమాకెళ్లాడేమో... నే వస్తానండి' రంగారావు సైకిలెక్కి ముందుకెళ్ళిపోయాడు.

సుబ్బరామయ్య నిట్టూర్చాడు. మెల్లగా నడుచుకుంటూ మెయిన్ రోడ్డుమీదకు చేరుకున్నాడు. అక్కడున్న లైటుస్తంభం దగ్గర నిలబడ్డాడు.

'ఎప్పుడో ప్రొద్దుట తొమ్మిదిన్నరకు భోంచేసి ఆఫీసుకి బయలుదేరి వెళ్ళినవాడు, ఇంకా రాలేదు.'

'ఆఫీసులో వుండిపోయాడా? గవర్నమెంటు ఉద్యోగంకదా. ఏదైనా అర్జంటు పనివుండికూర్చొని చేయమనివుంటారు. బాబ్జీ చెప్పకుండా సినిమాకెళ్ళడు. తప్పకుండా ఆఫీసులోనే వుండివుంటాడు!'

'తను ఇప్పుడు ఆఫీసుకెళ్ళిచూస్తే? కానీ రెండుమైళ్ల దూరముంది. రిక్షాలో వెళ్ళాలి. దానికి డబ్బులుకోసం మళ్ళా యింటికివెళ్ళాలి. ఒంటిమీద బనీనుతో వచ్చేసాడు తను.'

'కాసేపు ఇక్కడే నిలబడి చూస్తేసరి. ఓ గంటపోయాక అప్పటికీ రాకపోతే, అలాగే ఆఫీసుకెళ్ళొచ్చు'.

లారీ ఒకటి చప్పుడు చేసుకుంటూ రోడ్డుమీదనుండి అతివేగంగా వెళ్ళింది. లారీ దూరమవుతున్నకొద్దీ, దాని శబ్దంకూడా తగ్గిపోతూ ఓ నిముషానికి పూర్తిగా తగ్గిపోయింది.

లైటు ఇచ్చేకాస్త వెలుతురూ తప్పించి మిగతా ప్రదేశమంతా చీకటిగావుంది. గాలిలో తిరిగే పురుగుల శబ్దాలు ఎప్పుడూ వినిపిస్తూనే వున్నాయి.

మనుషుల జాడ అసలు లేదు—ఆ ప్రదేశం కాస్త వూరు బయట కావడం చేత.

సుబ్బరామయ్య కొడుకు వచ్చే దిక్కు చూస్తూ నిలబడి పోయాడు.

'ఈ క్షణంలో తన కొడుకు ఎక్కడ వున్నాడో తెలిస్తే బావుణ్ను. ఎక్కడున్నా క్షేమంగా వుంటే చాలు. తెల్లవారిన తర్వాతైనా తిరిగివస్తాడు.'

'అసలే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా వున్నాయి. రాత్రిపూట లారీలు విపరీతమైన వేగంతో వెళుతుంటాయి. డ్రైవర్లు నిద్ర పోతూ లారీలు నడుపుతారు. కొంతమంది బాగా తాగి నడుపుతుంటారు.'

'తన బాబ్జీకి అటువంటి రోడ్డు ప్రమాదం ఏమీ జరగలేదు కదా?'

'వాడికి ఉద్యోగం వచ్చి ఏడాది అయింది. ఆఫీసు కాస్త దూరమని తనే సైకిలు కొనక్కోమన్నాడు డైనమో కూడా వేయించాడు. సైకిలు కొన్న తర్వాత కాస్త ఆలస్యంగానే వస్తున్నాడు యింటికి. ఆఫీసు అయిదు గంటలకల్లా అయిపోతుంది. తర్వాత ఏ సెంటర్లోనో స్నేహితుల్తో కబుర్లలో పడితే కాలం తెలియదు, వాడికి.'

'తనూ చిన్నతనంలో అంతే. స్నేహితుల్తో కబుర్లాడుతూ పదీ పదకొండు వరకు కాలక్షేపం చేసేవాడు.'

'బాబ్జీకూడా అలాగే కబుర్లలో పడిపోయాడా? అయినా అర్ధరాత్రి వరకూనా? పైగా తిండి తినకుండా?'

'మరి ఏమయినట్టు?'

'వుంటే ఆఫీసులో వుండాలి. లేకపోతే సినిమాకెళ్ళివుండాలి. ఇవిరెండూ కాకపోతే ... సైకిలు మీద వస్తున్న బాబ్జీకి ఏ ప్రమాదమూ జరగలేదుగదా! ... భగవాన్ ... అంత పరిస్థితి తెచ్చిపెట్టకు!'

'బాబ్జీ లేకపోతే తను బతకలేడు. వాడు తన బంగారు కల! తన వంశంలో డిగ్రీ చదివిన మొదటివాడు. జానికి తరపు వాళ్లలో కూడా డిగ్రీ వాళ్లెవరూలేరు. వాళ్లందరివీ నానాకాలపు చదువే, తనకుమల్లే. కానీ తన కొడుకు బియ్యే! మొదట్నుంచి బాగా చదువుకున్నాడు. మొదట్నుంచి బుద్ధిమంతుడు. చెడు స్నేహాలు ఎరుగడు. అదికావాలీ, ఇదికావాలీ, బట్టలు కావాలీ అని ఎప్పుడూ అడగలేదు. చిన్నప్పట్నుంచీ కుటుంబ ఆర్థిక పరిస్థితి ప్రకారం నడిచాడు, వాడి కాలేజీ చదువుకోసం తను అప్పులు చేశాడు. ఎన్నో ఇబ్బందులకు గురి అయ్యాడు. అయినా తన కష్టం ఫలించింది. బాబ్జీ బాగా చదువుకున్నాడు. ఉద్యోగం సంపాదించుకున్నాడు.'

'వాడికి ఓ సిగరెట్ అలవాటు లేదు. వక్కపొడి అలవాటు లేదు. బూతులు మాట్లాడగా తనెప్పుడూ వినలేదు. తన కొడుకు తనకు గొప్ప కావచ్చు. మిగతా వాళ్ళూ గొప్పగానే చెప్పారు. తను వాడి గురించి గొప్పగా అనుకోవడంలో తప్పులేదు.'

'తనలా ఎనిమిది చదివి బట్టలకొట్టులో గుమస్తా కాకుండా గవర్నమెంటు వుద్యోగం సంపాదించాడు. పదేళ్లుపోతే ఆఫీసరవుతాట్ట!



'రాష్ట్రపతి పాలన పోయింది సరే! మరి ప్రత్యేక ఆంధ్ర సంగతేమయింది మావా?'
'ఇదుగో నువ్ నోరుమ్మూసుకో!'

తప్పకుండా అవుతాడు. తనకా నమ్మకం వుంది.'

'మొన్న రాజయ్య కనపడి తనతో ఎంతో గోలపెట్టాడు! 'ఇదుగో సుబ్బరామయ్యా! మీ అబ్బాయి చాలా బుద్ధిమంతుడయ్యా. నువు చాలా అదృష్టవంతుడివనుకో. నాకూ వున్నాడు ఓ కొడుకు. ఏంలాభం ... రెండొందలయాభై జీతం వస్తుంది. యాభై మాత్రం నా మొహాన పడేసి పోతాడు. మరి రెండొందలు ఏం చేస్తాడో చెప్పకుంటే గుండెలుతరుక్కుపోతాయ్! ఇంతలేసి గుంట వెధవలు తాగుడుకు అలవాటుపడుతున్నారయ్యా ఈ కాలంలో.'

'ఒక్క రాజయ్యేకాదు, చాలామంది తనతో తమ కుమారులను గురించి ఇలాగే వాపొయ్యారు.'

'బాబ్జీ ఉద్యోగంలో చేరిన తర్వాత కాస్త సినిమాలు ఎక్కువగా చూడడం మొదలెట్టాడు. అది సహజం. తాను మాత్రం మొదట్లో ఎన్ని సినిమాలు చూడలేదు. అప్పుడు డ్రామాలెక్కువ. ప్రక్కవూళ్లో డ్రామా వేస్తున్నా వెళ్లేవాడు తను. ఆ వయసు అటువంటిది. ఇప్పుడంటే ఏ సినిమాకీ వెళ్లబుద్ధేయదు. డ్రామాకి కూడా వెళ్లబుద్ధేయదు. వయసు మీద పడుతున్నకొద్దీ అన్నిటిమీదా అనురక్తి తగ్గుతోంది.'

ఓ సైకిలు రిక్షా చప్పుడు చేసుకుంటూ వెళ్లింది. అందులో యువ దంపతులు వున్నారు. అమ్మాయి పూలుకాస్త ఎక్కువగా పెట్టుకుంది. అబ్బాయి తన చెయ్యిని

అమ్మాయి వీపు వెనుకగా పోనిచ్చి ఆమె భుజాన్ని పట్టుకున్నాడు.

'బాబ్జీకి ఇరవై రెండేళ్లు దాటు తున్నాయి. మంచి సంబంధం చూడాలి. బంగారు బొమ్మని తీసుకొచ్చి చేయాలి.

# అపేక్ష

పరో రెండేళ్లలో తను తాత కావాలి. కాని వాడు చేసుకోనంటున్నాడు యిప్పుడే. ముందు చెల్లి పెళ్లి కానివ్వు అంటాడు. వాడి పెళ్లి అయితే తనకి అదో సంతోషం.'

కొన్ని రిక్షాలు, సైకిళ్లు, అప్పుడే రోడ్డు మీద నుంచి వెళ్లాయి. నలుగురు మనుషులు నడుచుకుంటూ వెళ్లారు, సుబ్బరామయ్యని చూసుకుంటూ.

'సినిమాలు వదిలినట్టున్నారు. కాసేపు నిలబడితే మంచిది. సినిమాకి వెళ్లినట్టయితే ఈపాటికి వచ్చేస్తుంటాడు.'

సుబ్బరామయ్య అరగంట నిలబడ్డాడు. బాబ్జీ జాడ కనిపించలేదు.

'తను వాడికోసం ఇలా ఎదురు చూడడం వాడికి యిష్టంలేదు. ఎందుకు ఎదురు చూడడం ? నిద్ర పాడుచేసుకోవడం, మనసు పాడుచేసుకోడం కాదూ! అంటాడు. మొన్నొక సారి వర్షం వచ్చినప్పుడు, రాత్రి పదకొండు దాటినా బాబ్జీ యింటికి రాకపోతే, తను ఇక్కడే గొడుగు పట్టుకొని చాలా సేపు ఎదురు చూసాడు.

'ఎందుకు నాన్నా వర్షంలో నాకోసం ఎదురు చూడడం. ఆరోగ్యం పాడవదూ ? కాస్త ఆఫీసులో ఆలస్యమయింది ఇవాళ. చిన్న చిన్నదానికి కంగారుపడి ఒంటికి తెచ్చుకోకు' అని మందలించాడు.

కానీ తన ఆందోళన వాడికేంతెల్సు ? ఎప్పుడో (పొద్దుట భోంచేసివెళ్ళి రాత్రి పదకొండు గంటలవరకూ వాడు ఇంటికి రాకపోతే తనమనసు మనసులో వుంటుందా ? ఎటువంటి కీడు జరగదు, భగవంతుని దయ వలన. కానీ తనమనసు ఆగదు. అది వాడికి తెలియదు.

పది నిముషాలు గడిచాయి. సుబ్బరామయ్యకి ఆందోళన ఎక్కువయింది.

'ఇంకారాలేదువాడు...తన బాబ్జీకి ఈ సారి ఏమయినా ప్రమాదం జరిగిందేమో! ఇంత పెద్దవూరులో ఆక్సిడెంటు ఎప్పుడూ ఎక్కడో ఒకచోట జరుగుతూనే వుంటుంది. ఈ రోజు తన బాబ్జీకి జరిగివుంటుంది. తన మనసు కీడును శంకిస్తోంది. ఇక లాభంలేదు. ఇంటికి వెళ్ళి డబ్బులుతీసుకొని రిక్షావేసుకుని వాళ్ళ ఆఫీసుకు వెళ్ళిరావాలి...

సుబ్బరామయ్య అక్కడ్నించి చీకట్లో గబ గబా నడిచాడు ఇంటికి.

ఆయన మనసంతా ఆందోళనగావుంది. ఒళ్ళంతా చెమటపట్టేసింది. బనీను తడిసి పోయింది. వీధిలోని కుక్క 'భౌయ్' మని మళ్ళా అరిచేసరికి ఈసారి ఆయన వొణికాడు.

గేటుదగ్గర జానకి నిలబడివుంది.



mcm/ni/7 tel



'నిద్రపోలేదా ?' ఆందోళన కప్పిపుచ్చుకుంటూ అడిగాడు.

'మీరు వెళ్ళింతర్వాత నాకూ నిద్రపట్ట లేదు.' అంది.

సుబ్బరామయ్య ఇంట్లోకి వెళ్ళాడు. గదిలో లైటువేసి, చొక్కా వేసుకున్నాడు. అలమరలో వున్న డబ్బాలోంచి ఓ అయిదు రూపాయల కాగితాన్ని జేబులో వేసుకున్నాడు. లైటు తీసేసి గబగబా వరండాలోకి వచ్చాడు.

గేటుదగ్గర సైకిలు చప్పుడయింది.

బాబ్జీ సైకిలుతోపాటు లోపలికొచ్చాడు. జానకి గేటువేసి కొడుకువెంట వచ్చింది.

సుబ్బరామయ్య గాలిపీల్చుకున్నాడు. బాబ్జీ రాకనుచూసి. ఇంట్లోకివెళ్ళి లైటువేసాడు. చొక్కావిప్పేశాడు. ఐదురూపాయల్ని మళ్ళా డబ్బాలో పడేశాడు.

'ఇంకా నిద్రపోలేదా మీరు ?' ఆశ్చర్యంగా అడిగాడు బాబ్జీ

'నువ్వెక్కడికెళ్ళావ్ ? నువ్వు వస్తావని ఎదురుచూస్తు కూచున్నాం' అంది జానకి.

'మా స్నేహితుడొకడు ట్రాన్సఫరయి వెళ్ళిపోతుంటే స్టేషనుకి వెళ్ళాము. పదిగంటలకు రావల్సినబండి, ఒంటిగంటకు వచ్చింది' అన్నాడు.

సుబ్బరామయ్య వరండాలో పడుకున్న ముగ్గురి కూతుళ్ళను సరిగా పడుకోబెట్టాడు.

తర్వాత తన మంచంమీద మేనువాల్చాడు. సుబ్బరామయ్య మనసు అప్పుడు ఎంతో ప్రశాంతంగా వుంది.

* * *

రాత్రి పదిన్నర అయింది.

వర్షం సన్నగా కురుస్తోంది.

బాబ్జీ, ముగ్గురు ఆడపిల్లలూ భోంచేసి పడుకున్నారు. జానకి యింకా భోంచెయ్య లేదు, సుబ్బరామయ్యకోసం ఎదురుచూస్తూ.

సుబ్బరామయ్య రోజూ రాత్రి తొమ్మిది కల్లా ఇంటికి వచ్చేస్తాడు హోల్‌సేల్ బట్టల కొట్లో ఉద్యోగం. ఎనిమిదిగంటలకు కొట్లు కట్టేస్తారు. తర్వాత సైకిలెక్కి మెల్లగా మూడు మైళ్ళు తొక్కుకుంటూ ఇంటికి చేరతాడు.

పదిన్నర అయినా ఇంకా రాలేదేమిటా అని ఎదురు చూస్తోంది జానకి. ఓ సారి తడుచు కుంటూ గేటుదాకా వెళ్ళి వీధిలోకి చూసింది. సుబ్బరామయ్య వస్తున్నట్టు కనిపించలేదు

(47 వ పేజీ చూడండి)



మీ వంటి అందమైన వారిని
అందముగా రూపొందించుటకు

ఐటెక్స్
సౌందర్య సాధనములు

మనోరంజకమైన రంగులలో ఐటెక్స్ స్పెషల్ బిందీ (తిలకం) యిప్పుడు ప్లాస్టిక్ సీసాలలో దొరుకుచున్నది.




Aravind Laboratories
MADRAS-33

దానికి మిగిలిన ముగ్గురు పిల్లలు (ఇద్దరుపోగా) తల్లి కులాసాగా వున్నారట. ఆమె కిది రెండోకాన్పట. మొదటి అవల్లాయి. ఇప్పుడయిదేళ్లట.

ఆర్కాటు జిల్లా పోళూరు తాలూకా కలశపాకం అనే వూరికి చెందిన మురుగన్ అనే అతనికి అతని భార్య 20 ఏళ్ళ మరకతానికి పెళ్ళయిన్నాటి నుంచీ పోరేమలు పెళ్ళయి రెండేళ్ళయినా ఆనందం పొందలేని మరకతం మీద కిరసనాయిలు పోసుకుని, నిప్పంటించుకుని, ఆత్మహత్య చేసుకున్నదట.

—ఫాలాక్షుడు

## అపేక్ష

(37వ పేజీ తరువాయి)

కాస్త వర్షం ఎక్కువయేసరికి గబగబా లోపలి కొచ్చేసింది.

వర్షం మెల్లగా ఎక్కువవడం ప్రారంభించింది. కాసేపటికి గాలివిసురు కూడా ఎక్కువయింది. జల్లు వరండాలోకి వచ్చింది. అక్కడ పడుకున్న బాబ్జీ, ఆడపిల్లలు ముగ్గురూ మేల్కొన్నారు. ఆడపిల్లలు లోపల గదిలోకి వెళ్లి పడుకున్నారు. బాబ్జీ, ఇంకా మేలుకొని బయటకు చూస్తూ నిలబడ్డ తల్లిని అడిగాడు.

'నాన్న యింకారాలేదా ?'

'రాలేదు. పదకొండు అయింది.' ఆమె గొంతులో కాస్త ఆందోళన వ్యక్తం అయింది.

'వర్షం మూలాన ఎక్కడో ఆగిపోయి వుండాలి' అన్నాడు తన మంచంకూడా లోపలి గదిలోకి వేస్తూ.

అయివుంటుంది అనుకుంది.

'ఆయన వొచ్చేస్తార్లే! నువ్వు పడుకోరాదా !' అంటూ బాబ్జీ లోపలికెళ్లి పడుకున్నాడు.

జానకి బదులు చెప్పకుండా నిలబడిపోయింది, చాలా సేపు. ఓ సారి లోపలికెళ్లి టైము చూసి వచ్చింది.

పదకొండున్నర అయింది.

వర్షం తగ్గుముఖం పట్టింది.

'షాపులో ఎప్పుడూ ఆలస్యం అవదు. మరి ఎక్కడికి వెళ్ళినట్టు? ఏదీ అర్థం కాకుండా వుంది' జానకి కళ్ళల్లో నీళ్లు నిలిచాయి.

వర్షం పూర్తిగా తగ్గిపోయింది. మేఘాలు అసలు లేవు. పైన చుక్కలు మళ్లా వెలిశాయి.

వర్షం తగ్గి చాలా సేపయింది. వర్షం వస్తోందని ఎక్కడన్నా ఆగినా, ఈపాటికి వచ్చేయాల్సింది. 'ఎక్కడున్నారో ఏమో.' అనుకుంది.

'బాబ్జీని లేపి సైకిలు వేసుకొని ఆయన షాపుకి వెళ్లిరమ్మని చెప్తే. బాబ్జీ వెళ్తాడా?'

'ఎందుకే అంత కంగారు. ఆయన వచ్చేస్తుంటాడు.' అంటాడు.

'మొన్న వాడికోసం ఆయన రోడ్డుమీద రెండు మూడుగంటలు నిలబడి ఎదురు


దేహపుష్టికి
ఆరోగ్యానికి
గుండీల-డీ గోపాలాచార్యుల వారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్
మద్రాసు-17

దీర్ఘ రోగులకు ఉత్తమ వైద్యము



సపుంసకత్వము, శుక్ల నష్టము, హ్రస్వ ప్రయోగము, అసంతృప్తి ఉబ్బసము (దమ్ము), బోద కాళ్ళు, చెవుడు, కడుపు నొప్పి, కుష్టు చర్మవ్యాధులకు పోస్టులు ద్వారా కూడా వైద్యము చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల, డా దేవర,
టి. బి. రోడ్, పోస్ట్ : 551 తెనాలి,
బ్రాంచి 9—డి శివాజీస్ట్రీట్, మద్రాసు- 17.

తలనొప్పి లేక జ్వరబాధకు
అతిశీఘ్రంగా ఉపశమనం!



శాలోఫెన్
బాధానివారిణి మాత్రలు




అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారీంపు

శాలోఫెన్ తలనొప్పి, జ్వరం, పంటినొప్పి, ఒళ్లు నొప్పులకు అతి నిశ్చయంగా, శీఘ్రంగా ఉపశమనం కలిగిస్తుంది ఇది నిరపాయకరమైనది. శాలోఫెన్ డాక్టర్లు సిఫారసుచేసే పటువైన ప్రక్రియ కలిగియుంది.

FDS/AS/1928 TEA

చూశారు ఎంతసేపు ఆందోళన పడ్డారో ! అటువంటి ఆందోళన వీడికి లేశమాత్రమైనా లేదేం ? తండ్రికి కొడుకుమీద ఉండేంత ప్రేమ కొడుక్కి తండ్రిమీద ఉండదా?'

## అపేక్ష

'ఆయనికి ఏదో జరిగి ఉంటుంది. సైకిలు మీద వస్తూ ఎక్కడ పడిపోయారో... ఎప్పుడూ ఇంత ఆలస్యం అవలేదు. రాత్రి పూట బయట ఎక్కడా ఉండలేరు, ఇంటికి రాకుండా. ఏదోకీడు జరిగి ఉంటుంది....'

జానకికి దుఃఖం పొంగుకొచ్చింది. కొంగ నోట్లో పెట్టుకుని శబ్దం రాకుండా వుండ డానికి ప్రయత్నించింది

గేటు చప్పుడయింది. జానకి కళ్ళనీళ్ళు తుడుచుకుంది గబగబా.

సుబ్బరామయ్య సైకిలు తీసుకుని లోపలి కొచ్చాడు.

'వర్షంలో తడిచారా' అడిగింది.

'కొద్దిగా తడిచాను...మధ్యలో ఓ యింటి దగ్గర నిలబడ్డాను వర్షం తగ్గేవరకు... ఇవాళ షాపులో లెక్కలవి చూడాల్సి వచ్చింది, దాంతో ఆలస్యం అయిపోయింది బయలు దేరడం' అన్నాడు.

సుబ్బరామయ్య గదిలోకి వచ్చి బట్టలు మార్చుకున్నాడు.

జానకి అన్నం వడ్డించింది. సుబ్బరామయ్య కాళ్ళు చేతులు కడుక్కుని భోజనంముందు కూర్చున్నాడు.

'మీరు ఎంతకీ రాకపోయేసరికి నాకెంత భయమేసిందో చెప్పలేను...బాబ్జీని మీషాపుకి పంపిద్దామనుకున్నాను . . కాని వాడు మంచి నిద్రలో ఉన్నాడు ..వాడికి నిద్రెలాపట్టిందో!.. మొన్నమీరు వాడికోసం అంతసేపు ఎదురు చూశారుకదా. . చాలాసేపు ఆందోళన పడ్డారు కదా... మీరు రాకపోతే వాడికి కొంచెంకూడా బాధ అనిపించలేదు చూశారా !' మనసులోని మాట చెప్పింది.

సుబ్బరామయ్య నవ్వాడు.

'ఎవరిమీద ప్రేమ వుంటే వాళ్ళకోసం ఎదురు చూస్తారు, బాధపడ్తారు' సుబ్బ రామయ్య నవ్వాడు, జానకి కళ్ళల్లోకి చూస్తూ.

'వాడికి మీరంటే ప్రేమలేనట్టు వుంది' భయంగా అంది.

సుబ్బరామయ్య మళ్ళా నవ్వి 'పిచ్చిదానా ! అటువంటి సందేహాలు పెట్టుకోకు. వయసు మళ్ళిన వాళ్ళం కనుక, మనకి ఆందోళనలూ, భయాలు ఎక్కువ. గుండె నిబ్బరం తక్కువ. వయసులో వున్నవాడు కనుక, వాడికి ఆందోళనలూ, భయాలూ వుండవు. అంత మాత్రంచేత మనమీద వాడికి ప్రేమ లేదు అనుకోకూడదు' జానకి బాధపడకుండా [వుండేందుకు] చెప్పాడు.




Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor. S. Radhakrishna